andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3। కనిష్ఠం 24.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 5 సెప్టెంబరు 2024



125 మంది జిల్లా ఉపాధ్యాయులకు పురస్కారాలు

బాసర, సెప్టెంబరు, 4 : జిల్లాలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 125 మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారని జిల్లా విద్యాధికారి డా. రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కేజీబీవీ, సంక్షేమ ఎంజేపీ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మరో 22 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ప్రత్యేకప్రశంసా పురస్కారాలను అందించనున్నట్లు వివరించారు. జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సెప్టెంబర్ 5వ తేదీన ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అంతా.. మా ఇష్టం







ట్రిపుల్ ఐటీలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది



మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

బాసర, సెప్టెంబరు, 4 : బాసర ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీ అక్రమాలకు నిలయంగా మారింది. కొందరు అధికారులు గుత్తేదారులకు వత్తాసు పలుకుతూ టెండరు గడువు ముగిసినా వారినే కొనసాగించడం వివాదాస్పదంగా మారుతుంది. అధికారం ఉంటే చాలు నచ్చినట్టు ఏమైనా చేయచ్చని నిరూపిస్తున్నారు కొందరు అధికారులు. వాస్తవానికి పాత కాంట్రాక్టర్ల గడువుకంటే ముందుగానే కొత్తటెండర్లు వేసి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇదంతా పారదర్శకంగా చేపట్టాల్సిన పనిని అధికారులు టెండరు ప్రక్రియ చెపట్టకపోవడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకటి, రెండు విషయాల్లో కాదు ట్రిపుల్ ఐటీలో కొనసాగుతున్న అన్ని ప్రైవేటు కాంట్రాక్టుల్లో పాత వారినే కొనసాగిస్తున్నారు. ఒకటి, రెండు నెలల స్వల్పవ్యవధి కాదు. రెండు నుంచి మూడేళ్ల పూర్తవుతున్నా పాత కాంట్రాక్టు సంస్థలనే కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అడిగే వారు ఎవరూ అన్నట్లు అధికారులు యథేచ్ఛగా పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి పాతుకపోయిన కాంట్రాక్టర్ల వ్యవస్థలతో ఇబ్బందులు ఎదురైనా ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. వడ్డించే వాడు మనవాడైతే... అడ్డేముంది అన్న చందంగా కొన్ని కాంట్రాక్టు వ్యవస్థలు రెచ్చిపోతున్నాయి. అధికారుల ఆశీర్వాదలే ఉండడంతో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

ఆ సంస్థపై ఎందుకంత ప్రేమ

క్యాంపస్‌లో కొనసాగుతున్న హౌస్‌కిపింగ్ సెక్యూరిటీ సంస్థల గడువు 30 నెలల క్రిందటే ముగిసింది కొత్తటెండరు వేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా పాతవారే కొనసాగుతున్నారు. ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ రావడం లేదని, వేతనాలు సరిగా చెల్లించడం లేదని అనేక సార్లు ఫిర్యాదు చేశారు. చివరికిస్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ ఎదుట ఇదే విషయాన్ని మొరపెట్టుకున్నారు. కాంట్రాక్టర్లతో కొందరు అధికారులు కుమ్మక్కవడంతో కార్మికులు ఎన్ని ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

- బాసర ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లవుతున్నా.. పాతవారినే కొనసాగింపు
- ఫుడ్ పాయిజన్ అయిన సంస్థలకే రెన్యూవల్
- సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సంస్థల గడువు ముగిసి రెండున్నర ఏళ్లు
- క్యాంపస్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు
- కాంట్రాక్టర్లకే అధికారుల వత్తాసు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

ఫుడ్ పాయిజన్ అయినా... నో ప్రాబ్లమ్

ట్రిపుల్ ఐటీలో 9వేల మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు పలు క్యాటరింగ్ సంస్థలకు బాధ్యతలు అప్పజెప్పారు. వీటికి టెండరు సమయంలో ఒక ఏడాది గడువుతోపాటు మరో ఏడాది రెన్యూవల్ పీరియడ్ ఉంటుంది. ఈ రెండు సంవత్సరాల గడువు రెండేళ్ల క్రిందటే పూర్తయింది. అయినా ఇంకా వారినే కొనసాగిస్తున్నారు. అంటే టెండరు గడువు ఏడాది ఉంటే నాలుగేళ్ల కాంట్రాక్టు పీరియడ్ అధికారుల పుణ్యమా అని పొందుతున్నారు. మరో సమస్య ఏమిటంటే కొన్ని క్యాటరింగ్ సంస్థలపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. విద్యార్థుల భోజనాల్లో పురుగులు, కప్పలు వచ్చినా సందర్భాలు ఉన్నాయి. ఫుడ్ పాయిజన్ జరిగి వందలాది మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. పలువురు విద్యార్థులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. అయినా యూనివర్సిటీ అధికారులు ఆ సంస్థలకే జై కొట్టడం అనేక ఆరోపణలకు తావిస్తుంది. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. విద్యార్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్‌లకు యూనివర్సిటీ బాస్‌లతోనే సంబంధాలు ఉండడంతో కింది స్థాయి సిబ్బంది కఠినంగా విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది.

అడ్డదారిలో వ్యాపారాలు

క్యాంపస్‌లో పలు వ్యాపారాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఆయా హాస్టళ్లలో , కార్యాలయం ఎదుట గల సూపర్‌మార్కెట్ ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నట్లు తెలిసింది. ఉద్యోగులు, వారి బంధువులు అక్రమంగా ఈ వ్యాపారాలు ఎలాంటి టెండరు లేకుండానే నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్థానికులు ఈ వ్యాపారాలపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకుంటున్న కార్మికులు (ఫైల్)

త్వరలోనే టెండర్లు పిలుస్తాం

(వెంకటరమణ, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ)



మెస్‌లతో పాటు అన్ని టెండర్లు పిలుస్తాం. ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. దాన్ని కూడా టెండరు వేస్తాం. ఇప్పటికే అన్నింటి టెండర్లు వేసేందుకు రెడీ చేయాలని ఆదేశించాం. ఇక సూపర్ మార్కెట్‌కు సంబంధించిన ఫైల్‌ను తీయిస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.



క్యాంపస్‌లో ఉన్న సూపర్‌మార్కెట్

మట్టి వినాయకులను ప్రతిష్ఠిద్దాం

- కలెక్టర్ అభిలాష అభినవ్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, సెప్టెంబరు 4 : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకు విగ్రహాలనే ప్రతిష్ఠించాలని జిల్లా కలెక్టర్ అభిలాస అభినవ్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పర్యావరణ హితమైన మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన పెంచేందుకు కాలుష్య నియంత్రణ మండలి వారి పోస్టర్లను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌తో కలిసి ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరికి మట్టి విగ్రహాల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా రసాయన రంగుల ద్వారా కలిగే అనార్థాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికరులు పలువురున్నారు.

నాగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు

నిర్మల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మామడ మండలంలోని పొన్కల్ గ్రామ గోదావరి నది సమీపంలో సదర్మాట్ బ్యారేజీ ముంపునకు గురవుతున్న నాగమ్మ పునర్నిర్మాణానికి 40 లక్షలతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చొరవతో బుధవారం రోజున దేవాదాయ శాఖ తరపున కేఎల్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ వారికి రూ.40 లక్షల టెండర్ దక్కిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కే. గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇరిగేషన్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రేవంత్ రెడ్డితోనే సాధ్యమవుతుందని తెలిపారు. పొన్కల్ గ్రామస్తుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- జిల్లా ఎస్పీ జానకీషర్మిల

భైంసా, సెప్టెంబర్ 04; వచ్చే గణేష్ నవరాత్రి ఉత్సవాలను భైంసా పట్టణవాసులు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ జానకీ షర్మిలా పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని గణేష్ నగర్ మున్నూరుకాపు సంఘ భవనంలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో కలిసి హిందూ ఉత్సవ సమితి, గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతికమిటి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యాత్మక ప్రాంతమైన భైంసాలో గణేష్ ఉత్సవాల కోసం గాను పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లుగా పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పటిష్ఠ ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రార్థన మందిరాలు, సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక చవితి వేడుకలై నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశామన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్త చర్యలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వినాయక మండలిలు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్న సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు సహకరించి వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కోమల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెప్ కాశీనాథ్, సీఐ రాజారెడ్డి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల

అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ధర్నా

- బంద్ పాటించిన కుభీర్ గ్రామస్థులు
- ప్రధాన వీధుల గుండా ర్యాలీ
- కూడలిలో రాస్తారోకో

కుభీర్, సెప్టెంబరు 4 : మండల కేంద్రంలోని వడ్డెర, మేరగల్లీ , ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీగోడ గుండా ప్రవహించే ప్రధాన మురికికాలువపై పలువురు గత పది సంవత్సరాల క్రితం నుంచి అక్రమంగా నిర్మించుకున్న రేకులుషెడ్‌లను వెంటనే తొలగించాలని బుధవారం గ్రామస్థులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ముందుగా విఠలేశ్వర ఆలయంలో గ్రామస్థులు సమావేశం నిర్వహించారు. ప్రధాన మురికి కాలువపై రేకులషెడ్‌లను తొలగించకుండా అధికారులు మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ నుండి పొక్లెయినర్‌తో కాల్వను తవ్వి మురికినీటిని విఠలేశ్వర ఆలయం వెనకభాగంలోకి మళ్లించడంతో ఆలయంలోకి మురికినీరు చేరి ముంపునకు గురవుతోందని గ్రామస్థులు, ఆలయ కమిటీ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై బుధవారం మండల కేంద్రం బందుకు పిలుపునిచ్చారు. సమావేశానికి సంబంధిత ఎంపీడీవో మోహన్‌సింగ్, కార్యదర్శి రాజేశ్వర్, కారోబారి ప్రకాష్‌లను పిలిపించి నిలదీశారు. కాగా ఎంపీడీవో మోహన్‌సింగ్ మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని వర్షపునీటిని మళ్లించమని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాల్వను తవ్వించి ఆలయం వెనక బాగాన వదిలినట్లు తెలిపారు. మీకేమయినా ఇబ్బంది ఉంటే తవ్వించిన కాల్వను మూసి వేస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్థులు ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహిస్తూ బస్టాండ్ సమీపంలోని అన్నబాహుసాతే కూడలిలో కుభీర్-భైంసా రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పూర్వం గ్రామస్థులు గ్రామంలో వరదనీరు చేరకుండా గ్రామాలపై భాగంగలో మైసమ్మ చెరువును నిర్మించారని అన్నారు. ఇటీవల గత 15 సంవత్సరాల నుంచి కొందరు అక్రమార్కులు చెరువును కబ్జా చేయడంతో పాటు చెరువు కట్టట తవ్వేసి రేకులషెడ్లను నిర్మించడం కారణంగా వర్షం కురిసిన వెంటనే మేదర కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోకి వర్షపునీరు చేరి ముంపునకు గురవుతోందని అధికారులకు వివరించారు. మైసమ్మ చెరువుకట్ట తొలగించడంతోనే వరద నీరు సమస్య ఏర్పడిందని దీనికి తోడు ప్రధాన మురికికాల్వపై అక్రమంగా రేకుల షెడ్‌లు వేయడం కారణంగా వర్షపు నీరు ప్రవహించరాకుండా మేదర కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి ముంపుకు గురవుతోందని తెలిపారు. షెడ్‌లను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ వచ్చేంత వరకు విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై రవీందర్, తహసిల్దార్ సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్, భైంసా రూరలల్ సీఐ నైలు సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించి, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన లాభం లేకపోయింది. దీంతో గ్రామస్థులు రోడ్డుపై టెంట్ వేసుకొన వంటావార్పు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డి వచ్చి సముదాయించగా, గ్రామస్థులు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశి ధర్నాను విరమించారు. ఆసుపత్రి ఆవరణలో కొందరు వెల్డింగ్ పనులు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకొని వారిని ఆసుపత్రిక ఆవరణ నుంచి తొలగించాని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు బోయిడి విఠల్, పడిపెల్లి గంగాధర్, ఎన్నిల అనీల్, పుప్పాల పీరాజీ, ప్యాట లక్ష్మణ్, డా. పెంటాజీ, నాగలింగం, సాప పండరి, డా. పోశెట్టి, బొమ్మెడి మల్లేష్, గ్రామ యువకులు, కుల సంఘాల సభ్యులు ఉన్నారు.



కుభీర్ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు

సీఎం రేవంత్‌రెడ్డి మాటలు బాధ్యతారహితంగా ఉన్నాయి

- బీజేపీ రాష్ట్ర నాయకులు



నిర్మల్, సెప్టెంబరు 4 : భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలు బాధ్యతారహితంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టపరిహారం ప్రధాని నరేంద్రమోదీ డబ్బులు ఇస్తేనే పరిహారం ఇస్తానని అనడం ఆయన చేతగాని తనాన్ని నిరూపిస్తుందన్నారు. కేంద్రం నిధులు రూ. 1345కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని, ముందు వాటిని ఖర్చు చేయాలన్నారు. తరువాత తక్కువయితే కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో జీఎన్‌ఆర్ కాలనీ వాసులు ప్రతి సంవత్సరం వర్షాలు వచ్చినాయంటే బతుకులు బిక్కుబిక్కు మంటూ ఇల్లు వదిలి పునరావాస కేంద్రాల్లో ఉండాల్సిన పరిస్థితి వస్తున్నదిని దానికి బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని, అదే విధంగా వారికి శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

భైంసా రూరల్, సెప్టెంబరు 4 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఆగస్టు 15న బెహరాన్ చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వారితో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వారికి సహాయం చేస్తానని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆనందరావు పాటిల్, హైమద్‌ఖాన్, తిమ్మాపూర్, గ్రామ మాజీ సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ రమేశ్వర్, సంతోష్, జి. శ్రీనివాస్, ప్రశాంత్, బి. పెద్దబాబు, బి. చిన్నబాబు, గోపి, భోజన్న ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కదిలి, కాల్వ ఆలయాల హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, సెప్టెంబరు 4 : మండలంలోని కదిలి పాపహరేశ్వర దేవస్థానం, కాల్వ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించారు. కదిలి దేవాలయం హుండీ ద్వారా రూ. 4,08,049ల నగదు, ప్రత్యేకదర్శనం, అభిషేక పూజ, అన్నదానం టికెట్ల ద్వారా రూ. 2,20,000లు మొత్తం రూ. 6,28,049ల ఆదాయం వచ్చింది.

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 3,35,955ల నగదు, టికెట్ల ద్వారా రూ. 56,417లు మొత్తం రూ. 3,92,372లు ఆదాయం లభించింది. హుండీల లెక్కింపులో కదిలి, కాల్వ ఆలయాల ఛైర్మన్లు వెంకట్ రావు పాటిల్, మహేష్, ఆయా ఆలయాల ధర్మకర్తలు, దత్తు పటేల్, నర్సయ్య, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రాజమౌళి, కార్య నిర్వహణ అధికారి భూమయ్య, ఆయా ఆలయాల రికార్డుల అసిస్టెంట్లు మాధవ్ రావు, మనోహర్, భక్తులు పాల్గొన్నారు.

అలుగులో చేపల వేట



అలుగులో చేపలు పడుతున్న దృశ్యం

ముథోల్, సెప్టెంబరు 4 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. అయితే చించాల, ముథోల్‌లో చెరువుల వద్ద ప్రజలు వలలు, గాలాలు, చీరలతో చేపలను పడుతూ సందడి చేశారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి

సారంగాపూర్, సెప్టెంబరు 4 : మండలంలోని వంజర్ గ్రామంలో గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. మృతికి గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కండెల భోజన్నను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజీ నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, లింగారెడ్డి, నాయకులు మారుతి, రమణారెడ్డి, సురేందర్‌లతో పాటు నాయకులు ఉన్నారు.


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

తలమడుగు, సెప్టెంబరు 4: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఒకరికి డెంగ్యూ జ్వరం సోకడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ నిర్మూల కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో ఇలాంటి వ్యాధుల సోకిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. వ్యాధులలు సోకకుండా వైద్య సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది అవగహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పోషణ అభియాన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోషక ఆహారంపై అంగన్వాడి కార్యకర్తలు గ్రామీణ ప్రజలకు అవగహన కల్పించానన్నారు. అనంతరం ఆసుపత్రిని తనకు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఈవో సుధీర్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ డాక్టర్ హరీశ్, పంచాయతీ సెక్రెటరీ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ప్రారంభం

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్షికోత్సవాలను బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు తెలంగాణ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. భూమికోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటం సాగిందని తెలిపారు. విష్ణూర్ రామచంద్రారెడ్డి గుండాల కాల్పుల్లో 1956 జూలై 4న దొడ్డి కొమురయ్య అమరుడయ్యాడని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవాలు ఈ నెల 17 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్త్రాత్రి, నాయకులు లింగాల చిన్నన్న, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఎన్.స్వామి, మహిళ నాయకులు ఆర్.మంజుల, సుజాత, తదితరులు

బడి బస్సు, బొలెరో వాహనం ఢీ

● డ్రైవర్ తలకు తీవ్ర గాయాలు

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఇచ్చోడ, సెప్టెంబరు 4: పాఠశాల బస్సు బొలెరో వాహనం ఢీకొని డ్రైవర్ తలకు గాయాలైన సంఘటన మండలంలోని సిరిచెల్మ గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటనకు సంబంధించి వివరాలను పరిశీలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన గోల్డెన్ లీఫ్ పాఠశాలకు చెందిన బస్సు సిరిచెల్మ గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులను వారి గమ్యస్థానానికి చేరవేసి తిరుగు ప్రయాణంలో పాఠశాల బస్సు ఎదురెదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో ఇరు వాహనాల అద్దాలు ధ్వంసమై డ్రైవర్లకు గాయాలయ్యాయి. పాఠశాల బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. గతంలో సైతం పాఠశాలల బస్సులు, టాటా మ్యాజిక్‌లకు సైతం ఇలాంటి సంఘటనలు జరిగినా ఇటు పోలీసులు.. అటు ఆర్టీవో అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠశాలల వాహనాలకు సరైన పత్రాలు ఉన్నాయా..? డ్రైవర్‌కు లైసెన్స్ ఉందా..? బండి ఫిట్‌నెస్ ఉందా..? అని తెలుసుకునే వారు లేరు. వాహనాల అద్దాలు పగిలి ఉన్నా.. పిల్లలను అవే వాహనాల్లో పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. అసలు పాఠశాల బస్సులలో, టాటా మ్యాజిక్ వాహనాల్లో అన్ని రకాల పత్రాలు ఉన్నా.. పరిమితికి మించి విద్యార్థులను పాఠశాల వాహనాలల్లో పంపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజులు లక్షల్లో వసూలు చేస్తున్నప్పటికీ వాహనాల్లో సీట్లకు సరిపడా విద్యార్థులను కూర్చోబెట్టుకోవాల్సి ఉండగా.. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాల కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి భద్రతలేని వాహనాలను సీజ్ చేసి ఫిట్‌నెస్ ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతులివ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాధిత మహిళకు న్యాయం చేయాలి

నార్నూర్, సెప్టెంబరు 4: మండలంలోని దేవుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గోండ్ మహిళ పై దాడి చేసిన వారిని ప్రభుత్వం చట్టపరంగా కఠినంగా శిక్షించాలని తుడందెబ్బ నార్నూర్ గాదిగూడ మండల ఆదివాసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం చౌక్ దగ్గర నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చట్టాల విరుద్ధంగా మాపై దాడి జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ రోజు గిరిజన మహిళల పై ఇలాంటి దాడులు జరుగడం ఎంత వరకు సమంజసమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తుడందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మేస్రం మాణిక్‌రావు, మడావి సాగర్ పాల్గొన్నారు.

'ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్ అమలు చేయాలి'

నేరడిగొండ, సెప్టెంబరు4: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరుతూ దళిత సమన్వయం పాదయాత్ర చేపట్టం జరిగిందని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. బుధవారం పాదయాత్రలో భాగంగా నారాయణపూర్ గ్రామంలో ఆయన మాట్లాడారు. 70ఏళ్లుగా దేశంలో ఎస్సీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ ఫలాలు కేవలం 3 శాతం మందికే దక్కాయన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అందరికి దక్కాలనే ఉద్దేశ్యంతో ఈ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్‌లలో క్రిమిలేయర్ విధానం అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత వికాస సమతి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్, సెప్టెంబరు 4: మండలంలోని ఆయా గ్రామాలలో గల స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు ద్వారా అందిస్తున్న స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఇందిరా క్రాంతిపథకం జైనథ్ ఏపీఎం నాగుల భగవండ్లు అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో గల దుర్గాదేవి గ్రామ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళ శక్తి పథకం ద్వారా గేదెలు, మేకలు, గొర్రెలు, కోడి పిల్లలు, కోళ్ల పెంపకం వంటి చేయవచ్చన్నారు. దీంతో పాటు ఎంటర్ ప్రైజేష్ కింద హోటళ్లు, కిరాణ షాపులు, పాన్‌షాపులు, జనరల్ స్టోర్‌ల పెట్టుకొని మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ జి.గంగారాం, వీఓ లీడర్లు రూప, మమత, వీఓఏ రఫీలతో పాటు గ్రామ స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


లక్ష్మీపూర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జైనథ్, సెప్టెంబరు 4: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జైనథ్ పీహెచ్‌సీ కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ వసంత అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించి గ్రామ ప్రజలతో పాటు అం గన్‌వాడీ కేంద్రంలో ఉన్న గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు మాత్రాలను అందజేశారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సంగీత, అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, మణిమాల, ఆశావర్కర్ వెంకటమ్మ, లక్ష్మీపూర్ గ్రామస్థులు గర్భిణులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్

నేరడిగొండ, సెప్టెంబరు4: నియోజక వర్గంలో ఏ సమస్య ఉన్న పరిష్కరించడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల గ్రామాన్ని సందర్శించారు. ముందుగా గ్రామస్థులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. గ్రామంలో గల గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహాకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

కుచిర్యాల గ్రామ సమస్యలను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, సెప్టెంబరు 4: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కుచిర్యాల తండా వాసులు గురువారం ఉదయం స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్‌ను కలిసి తమ గ్రామ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని అంతేగాక రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు తన వంతు సహకారం ఉంటుందని గ్రామస్థులకు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీలో.. మళ్లీ పోరుబాట





విద్యార్థుల డిమాండ్లు ఇవి..

- యూనివర్సిటీలో నాయకత్వ మార్పు జరగాలి. స్థానికంగా ఉండే రెగ్యులర్ వైస్ చాన్సలర్, డైరెక్టర్‌ను నియమించాలి
- ఆర్థిక పారదర్శకత, జవాబుదారి తనం ఉండాలి.
- గత రెండేళ్ల నుంచి ఖర్చుల వివరాలను వెల్లడించాలి
- మెస్‌ల్లో భోజన నాణ్యత పెరగాలి. మెనూను పాటించేలా చర్యలు తీసుకోవాలి. పారదర్శకత పద్ధతిలో మెస్ కాంట్రాక్టులను కేటాయించాలి.
- పర్మినెంట్ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాప్‌ను నియమించాలి.
- క్యాంపస్‌లో ఉన్న ఆసుపత్రిలో సౌకర్యాలను మెరుగు పరచాలి. వైద్య నిపుణలను నియమించాలి. ముఖ్యంగా విద్యార్థినుల కోసం లేడీ డాక్టర్లను నియామకం జరపాలి.
- ఫుడ్ కోర్టును ఏర్పాటు చేయాలి.
- ఆట పరికరాలను సమకూర్చాలి.
- హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరచాలి.
- విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపి భవిష్యత్తులో జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎన్‌సీసీని అమలు జరపాలి.

- సమస్యల పరిష్కారం కోసం ఆందోళన మొదలు పెట్టిన విద్యార్థులు
- పరిష్కరించకుంటే గతంలో మాదిరి ఆందోళన చేస్తామని హెచ్చరిక
- క్యాంపస్‌లో మళ్లీ ఉద్రిక్తత వైపు పరిస్థితులు

బాసర, సెప్టెంబర్, 4 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీలో విద్యా ర్థులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. అనేక సార్లు సమస్యలపై విన్నవిం చిన విద్యార్థులు చివరికి పోరాటం తప్పదని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మంగ ళవారం రాత్రి హాస్టల్ భవనంలో సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించుకున్నారు సమస్యల జాబితాను అధికారుల ముందుంచారు. జాబితాలో ఉన్న వాటిని ఇది వరకు చాలా సార్లు అధికారుల దృష్టికి తెచ్చారు. గత రెండేళ్ల క్రిందట ఇలాగే విద్యా ర్థులు సమస్యల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. సుమారు 8 వేల మంది విద్యార్థులు ఆనాడు వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేప ట్టారు. రాత్రి, పగల, ఎండ, వాన అని లెక్కచేయకుండా విద్యార్థులు వారం రోజుల పాటు శాంతి యుతంగా నిరసన తెలిపారు. విద్యార్థుల నిరసనకు రాష్ట్ర జాతీ య స్థాయి నేతలు స్పందించేలా వీరు ఉద్యమించారు. చివరికి అప్పటి ప్రభుత్వం దిగివచ్చి పలు మార్లు మంత్రుల బృందాన్ని పంపించి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించింది. కాని ఇక్కడున్న అధికారుల నిర్లక్ష్యం మూలంగా యూనివర్సిటీలో చాలా సమ స్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. కాగా కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయి. మరో మార్గం లేక విద్యార్థులు పోరుబాటను ఎంచుకోవాల్సిన పరిస్థితులు తలె త్తాయి.



వైస్ చాన్స్‌లర్ భవనం ఎదుట ఆందోళన

విద్యార్థుల కార్యాచరణలో భాగంగా మొదటి రోజు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సుమారు రెండున్నర వేల మంది విద్యార్థులు క్యాంపస్‌లో ప్రధాన వీధుల గుండా ప్లకార్డులు, నినాదాలతో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైస్ చాన్సలర్ భవనం ఎదుట ఆందోళనకు దిగారు. అధికారుల నిర్లక్ష్యాన్ని వె ళ్తెత్తిచూపుతూ నినాదించారు. సుమారు రెండు గంటల పాటు నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు శాంతియుత నిరసన కొనసాగుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు


వైస్ చాన్స్‌లర్ భవనం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ట్రిపుల్ ఐటీలో ముగిసిన ఇండక్షన్ ప్రోగ్రాం


పాల్గొన్న విద్యార్థులు, అధికారుల బృందం

బాసర, సెప్టెంబరు, 4: ఆర్జీయూకేటీ బాసరలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాం ముగి సింది. ఈ కార్యక్రమం దాదాపు 13 రోజుల నుండి కొనసాగుతుంది. చివరి రోజు కార్యక్రమానికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణదీర్ సాగి అసోసియేట్ డీన్స్ డా. చంద్రశేఖర్, మహేష్‌లు పాల్గొని ప్రసంగించారు. ఇండక్షన్ ప్రో గ్రాంలో 35మంది ఉపన్యాసకులు పాల్గొని వివిధ విభాగాలు వివిధ అంశా లపైన వ్యక్తిత్వ వికాసం, పబ్లిక్ స్పీకింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంజనీరింగ్ విద్యావిధానం సృజనాత్మక కలలు, సైబర్ సెక్యూరిటీ క్రీడారంగం, డెసిషన్ మేకింగ్, టైం మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై విద్యార్థులకు తెలియ జేసినట్లు తెలిపారు. ఈ సదస్సుతో విద్యార్థుల్లో ఆలోచన విధానంలో మార్పుకొని ఉన్నత లక్ష్యం వైపు పయనిస్తారని తెలిపారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో అత్యుత్తమైన లక్ష్యాలతో శ్రమిస్తే గొప్ప ఇంజనీరింగ్ సమాజానికి ఉపయోగపడుతారని పేర్కొన్నారు. ఆర్జీయూకేటీ అన్ని రంగా ల్లో విద్యార్థులు నైపుణ్యాన్ని సాధించుకునే విధంగా తగినచర్యలు చేపడు తున్నామని తెలిపారు. క్యాంపస్ ప్రాంగణ నియమకాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత విద్యరంగంలో విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారని వెల్లడించారు. అనంతరం వివిధ అంశాలపై విద్యార్థులక అవగాహన కల్పించిన అధికారుల బృందం డా. నాగాంజనేయులు (ఈసీఈ డిపార్టు మెంట్), వినయ్ కెమికల్ డిపార్ట్‌మెంట్) బావు సింగ్ (ట్రిబుల్ ఈ) డాక్టర్ విజయ్ కుమార్ (తెలుగు డిపార్టుమెంట్), ఆరిఫ్ అలీ (ఈసీఈ), హరికృష్ణ (టెక్నికల్ అసిస్టెంట్) పవన్ శిరసాని (టెక్నికల్ అసిస్టెంట్) లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త కిరణ్‌కుమార్, ఉద్యోగులు, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కులవృత్తిదారుల సంక్షేమంపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, సెప్టెంబర్ 04; కులవృత్తుదారులకు ఉపాధి కల్పించి వారి సం క్షేమం కోసం ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. బుధవారం పట్ట ణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఖాది ఇండియా పథకం కింద 33 మంది లబ్ధిదారులైన కుమ్మరి కులస్థులకు మంజూరైన ఎలక్ట్రికల్ పాటర్ వీల్ మట్టి పరికరాలను తయారు చేసే యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ- నేటి ఆధునిక కా లానికి అనుగుణంగా కులవృత్తుల వారు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల ని సూచించారు. కుమ్మరి కులస్థుల సంక్షేమానికి తన వంతుగా పాటు ప డుతానన్నారు. మట్టి పాత్రలను కాల్చే యంత్రాలతో పాటు, విశ్వకర్మ పథ కం కింద రుణాలను ఇప్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి జాగృ తి సొసైటీ నియోజకవర్గ అధ్యక్షులు లింగన్న, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజా క్, నాయకులు సోలంకీ భీంరావు, సౌంఫ్లీ రమేష్, బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేట్ సుష్మారెడ్డి, చంద్రకాంత్, కుమ్మరి కులస్తులు పాల్గొన్నారు.

గడ్డెన్న ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరిక

భైంసా, సెప్టెంబర్ 04; మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల మూలంగా గడ్డెన్న ప్రాజెక్టులోకి బుధవారం భారీగా వరద నీరు వచ్చి చేరింది. మంగ ళవారం వరద నీటి చేరిక తగ్గుముఖం పట్టడంతో అధికార యంత్రాంగం గేట్లను మూసి వేసి నీటి విడుదలను నిలిపివేసింది. అయితే మంగళవా రం అర్ధరాత్రి వేళ నుంచి బుధవారం ఉదయం వరకు భారీగా వర్షం కు రువడంతో ప్రాజెక్టులోకి క్రమక్రమంగా వరద నీరు చేరింది.

ముథోల్‌లో భారీ వర్షం


బోరిగాం - వడ్తాల్ గ్రామాల మధ్య లో లెవెల్ వంతెన వద్ద

ముథోల్, సెప్టెంబరు 4 : ముథోల్‌తో పాటు వివిధ గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి భారీ వర్షం కురవడంతో జన జీవనం అస్తవ్యస్తమైంది. స్థానిక సాయిమాధవ్‌నగర్‌లో వర్షం నీరు భారీగా ప్రవహించడంతో ఇళ్లలోకి, జ్యోతి బాపూలే పాఠశాలలోకి వర్షం నీరు చేరింది.

నిండు కుండలా సదర్మాట్

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంలో సదర్మాట్ వద్ద 55 వేలకు పై చిలుకు క్యూసెక్కుల నీరు గోదావరిలోకి

ఖానాపూర్, సెప్టెంబరు 4 : మండలంలోని మేడంపల్లి అడవుల్లో గోదావరి నదిపై నిర్మించిన అతి పురాతన ఆనకట్ట సదర్మాట్ ప్రస్తుతం నిండు కుండలా మారింది. ఎగువన ఎస్సారెస్పీ 41 గేట్లు ఎత్తడంలో సదర్మాట్‌కు వరద పోటెత్తింది. భారీగా వస్తున్న వరద నీరంతా సదర్మాట్ వద్ద పురాతన రాతి మత్తడి పైనుండి గోదావరిలోకి దూకుతూ చూపరులకు కనువిందు చేస్తోంది. భారీగా వస్తున్న వరదతో సదర్మాట్ వద్ద సుమారు 55 వేలకు పైగా క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సదర్మాట్‌కు భారీగా వరద నీరు వస్తుండడంతో రాతి మత్తడి పైనుండి దూకే ఆ నీటి అందాలను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుండి పర్యాటకులు తరలిస్తున్నారు. కాగా గోదావరి ఉగ్రరూపంతో ప్రవహిస్తున్నందున పర్యాటకులను లోనికి పోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వరద ఉధృతి తగ్గే వరకు పర్యాటకులు ఆనకట్ట వద్దకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.


నిండుకుండలా దర్శనమిస్తున్న సదర్మాట్ ఆనకట్ట

ఓడిపోయినా.. బుద్ది రాలేదు : ఎమ్మెల్యే

ఆదిలాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో మాజీ మంత్రి జోగు రామన్నను ప్రజలు ఓడించినా.. బుద్ధి రాలేదని ఆదిలాబాద్ ఎమ్మె ల్యే పాయల శంకర్ ఘాటు విమర్శలు చేశారు. నియోజక అభివృద్ధి కోసం మంత్రితో కలిసి వెళ్తే తప్పేంటో జోగు రామన్న చెప్పాలన్నారు. బుధ వారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఓర్వలేకనే నాపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జోగు రామన్న మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. గత 30 ఏళ్ల క్రితం మూతబడిన సి మెంట్ పరిశ్రమను తెరిపించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి విన్నవిస్తే తప్పేలా అవుతుందో చెప్పాలన్నారు. కేవ లం కమిషన్ల కోసమే సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తున్నారని అనడం సి గ్గుచేటన్నారు. కనీస అవగాహన, జ్ఞానం లేకుండా మాట్లాడడం జోగు రా మన్నకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు అంకత్ రమేష్, మయూర్‌చంద్ర, లాలామున్నా, జోగురవి, దినేష్‌మటోలియా, దయాకర్, ముకుంద్, తోగల నరేష్, మహేశ్‌వెంకన్న, బీంసేన్‌రెడ్డి తదితరులున్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 4: సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రి జర్వేషన్ 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సం దర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, శ్రీని వాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కామా రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. బీసీలకు రిజర్వేషన్ ప్రక టించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్ర మంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించిన మహిళా కమిషన్ సభ్యురాలు

ఉట్నూర్, సెప్టెంబరు 4: మండలంలోని టక్కుగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురా లు కుమ్ర ఈశ్వరీబాయి బుధవారం ఆకస్మికంగా సం దర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు, గర్భిణులు, బాలిం తలకు అందిస్తున్న పౌష్టిక ఆహారం, హాజరు, తదితర వాటి వివరాలు అంగన్‌వాడీ టీచర్ సరోజను అడిగి తెలుసుకున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రం పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రాథమిక పాఠశాలలో కొనసాగి స్తున్నామని, నూతన భవనం మంజూరు చేయించాలని మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి దృష్టికి అంగన్‌వాడీ టీచర్ సరోజ తీసుకొచ్చారు. ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నూతన భవనం మంజూ రు అయ్యేలా కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.


టక్కుగూడ అంగన్‌వాడీలో చిన్నారులతో మాట్లాడుతున్న ఈశ్వరీబాయి

- రక్షిత మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలి

ఉట్నూర్: నిజామాబాద్ జిల్లా రుద్రారం మండళం అక్బర్‌నగర్ పాలి టెక్నిక్ కళాశాలలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన రక్షిత కేసులల్లో విచారణ వేగవంతం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరీబాయి అన్నారు. బుధవారం గుడ్సూరు మండలంలోని హ స్నాపూర్‌కు చేరుకుని రక్షితకుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో చదువుకోవడానికి వెళ్లిన బాలిక అనుమానాస్పదస్థితిలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ సం దర్భంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అస లు ఏం జరిగిందో సీసీ ఫేటేజీలు సైతం పని చేయట్లేదని చెబుతు పోలీ సులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థిని తల్లిదండ్రులు మహిళ క మిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయితో అన్నారు. కాగా నిజామాబాద్ ఎస్పీతో మాట్లాడి ఘటనకు సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకుంటానని దర్యాప్తు విషయంలో వేగవంతం పెంచి న్యాయం చేస్తామని ఇచ్చారు.

అర్లి(కే)లో ముగిసిన అఖండ జ్యోతి

● జన జాతరగా మారిన గ్రామం ● శబరిమాత అడుగుజాడల్లో నడుచుకోవాలి : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


పల్లకీ ఊరేగింపుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తలమడుగు, సెప్టెంబరు 4: మండలంలోని అర్లి(కే)లో శబరి మాతా జీ అఖండజ్యోతి ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజర వ్వగా.. వేలాది మంది శబరిమాత భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం మొత్తం జన జాతరగా మారింది. ఎక్కడ చూసిన శబరి మాత నామస్మరణతో గ్రామం మార్మోగింది. భజన బృందాలు, బాజా భజంత్రీ లు, డీజేసౌండ్‌లతో గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. కాగా, ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ అమ్మ దీవెనలతో అర్లి(కే) గ్రామంలో 24 ఏళ్ల తర్వాత గతనెల 5న అఖండ జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామస్థులు నెలరోజుల పాటు ఎంతో భక్తితో ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆన్‌లైన్ కాలంలో కూడా ఇంత భక్తితో ఈ కార్యక్రమాన్ని గ్రామస్థు లు అందరూ కలిసి నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా పల్లకీ ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి యాత్రలో నృత్యం చేశారు. కాగా, జిల్లా నలుమూలల నుంచి కా కుండా కరీంనగర్, వరంగల్, ఖమ్మం, కామారెడ్డి, మహారాష్ట్ర, నాందేడ్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులందరికీ గ్రామ స్థులు భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు మండల నామకులు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదు

- బోథ్ పీఎస్‌ను తనిఖీ చేసిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం

బోథ్, సెప్టెంబరు 4: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు సహించ బోమని, ముఖ్యంగా గుట్కా, మట్కాలతో పాటు పేకాట వంటి వాటిని పూర్తిగా నిర్మూలిస్తామని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. మండలకేం ద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైనా శాంతి భద్ర తలకు విఘాతం కలిగించినట్లయితే సహించేది లేదన్నారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి గుట్కా అక్రమ రవాణా జరుగుతున్న విషయా న్ని ఎస్పీ దృష్టికి తీసుకురాగా తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పూర్తిగా అడ్డుకోవడం జరుగుతుందన్నారు. గుట్కా అక్రమ రవాణా దా రుల విక్రయదారుల సమాచారాన్ని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. శాంతిభద్రత పరిరక్షణలో జిల్లాలో పోలీ సులు ముందుచుపుగా వ్యవహరించి తగు చర్యలు తీసుకుంటున్నారన్నా రు. గంజాయి సాగు విక్రయాలపైన దృష్టి సారించడం జరిగిందని, బోథ్ మండలంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకుని జైల్లోకి పంపించడం జరిగిందన్నారు. యువత గంజాయికి బానిస కావద్దని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీతో పాటు సీఐ రమేష్, ఎస్ఐ ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్‌లో నైజాం కాలం నాటి ఫిరంగిని పరిశీలిస్తున్న ఎస్పీ

అంతకుముందు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషను బుధవారం ఎస్పీ గౌస్‌ఆలం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత కోచ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నైజాం కాలం నాటి ఫిరంగిని ఎస్పీ పరిశీలించారు. నైజాం కాలంలో వాడిన ఈ ఫిరంగులు బోథ్ పోలీస్ స్టేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్నాయి. ఇందులో సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్, తదితరులు ఉన్నారు.


బ్రిడ్జి వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

తెగిపోయిన బ్రిడ్జికి మరమ్మతులు పూర్తి

నార్నూర్, సెప్టెంబరు 4: గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని బాబేఝరి చిత్తగూడ దగ్గర ఉన్న బ్రిడ్జి తెగి పోయింది. దీంతో మండలం పరిధిలోని దాదాపుగా ఐదుకు పైగా గ్రా మాలు సుంగాపూర్ చోర్గావ్, బాబేఝరి చిత్తగూడ, దన్నూగూడ, మంజ రి, చిన్నగూడెలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా, బుధ వారం వర్షం తగ్గుముఖం పట్టడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి విజయ్‌తో పాటు పంచాయతీ సిబ్బంది వెంటనే తెగిపోయినా బ్రిడ్జికి జేసీబీ సహాయంతో మొరం మట్టి వేసి మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు పునర్ ప్రారంభమయ్యాయి. భారీ వర్షాల కారణంగా అత్యవసర పనులు నిమిత్తం తప్ప.. ప్రజలు బయటకు రాకుండా ఉండాలని ఆయన సూచించారు.


చెరువు మధ్యలో ఉన్న అతి పురాతనమైన శివాలయం

గంగమ్మ ఒడిలో సిరిచెల్మ మల్లన్న

- ఆలయం చుట్టూత జలం.. మధ్యలో మల్లికార్జునుడు
- దర్శనం కావాలంటే.. నాటుతెప్పలే దిక్కు

ఇచ్చోడ, సెప్టెంబరు, 4: శివుడు నెత్తిన తలదాచుకునే గంగమ్మ.. తన ఒడిలో శివుడిని దాచుకున్నట్లు ఉంది పైచిత్రం. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన మల్లి కార్జున స్వామి ఆలయం. గత వారం రోజులుగా ఎడితెరిపి లేకుండా కురు స్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలం లోని అతిపురాతన శివాలయమైన సిరిచెల్మ మల్లికార్జున ఆలయం చుట్టూ వర్షపునీరు చేరింది. దీంతో ఆలయ చుట్టుపక్కల పరిసరాలు కనులకు ఇంపుగా కనిపిస్తున్నాయంటున్నారు. చెరువులో నీటిమట్టం పెరగడంతో శివాలయానికి వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోయి ఆలయం చుట్టూత వర్షపునీరు నిలిచింది. మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్లాలంటే నాటు తెప్పలు కావాల్సిందే అంటున్నారు. భక్తులు. ప్రతీయేటా వర్షాకాలం ఇలాంటి సమయంలో నాటుతెప్పల సహాయంతో మల్లన్న దర్శనానికి వెళ్ల డం ఇక్కడ సర్వసాధారణంగా మారిందంటున్నారు.

'దళారీ వ్యవస్థను అరికట్టాలి'

నార్నూర్, సెప్టెంబరు 4: బ్యాంకులలో దళారీ వ్యవస్థని అరికట్టాలని జై భారత్ సంఘం జిల్లా అధ్యక్షుడు దీపక్‌పెందోర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌కు సంఘ సభ్యుల అం దరూ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ ప్రాంతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ అమాయక ప్రజలను ఆసరా చేసి కొంతమంది దళారులు దోపిడీ చేస్తున్నారని, దీంతో పాటే బ్యాంకులో గుర్తు తెలియని వ్యక్తులు సైతం ఈ వ్యవస్థని నడపడం వల్ల లబ్ధిదారులు ఇబ్బం ది పడుతున్నారన్నారు. రైతు రుణమాఫీ, రైతు రుణాలు విషయంలో ప్రజ లకు న్యాయం జరిగేలా సహకరించాలని మేనేజర్ రవిని కోరారు. కార్యక్ర మంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామస్థులున్నారు.

'పండుగల ప్రాముఖ్యత తెలుసుకోవాలి'

నేరడిగొండ, సెప్టెంబరు 4: తీజ్ పండుగ ఉత్సవాల ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాట్‌లొద్ది గ్రామంలో నిర్వ హించిన తీజ్ ఉత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోధుమ మొలకలు బుట్టలు నెత్తిన వేసుకొని పాటలు పాడుతూ యువతులు, చిన్నారులతో ఆడిపాడారు. ఈ పండుగ ప్రాముఖ్య తను వివరించారు. ఇందులో పార్టీ మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు, బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రఫుల్‌చందర్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన అధ్యక్షు డు బద్దం పోతారెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు



తలమడుగు మండలంలో వరదనీటితో దెబ్బతిన్న పత్తి పంట



బేల మండలం మాంగ్రూడ్‌లో పెన్‌గంగా నది వరదలు ముంచెత్తడంతో దెబ్బతిన్న పత్తి పంట



..కొగ్దూర్‌లో నేలకొరిగిన పత్తి పంట

కష్టమంతా.. నీళ్లపాలు!

- జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో 1,940 ఎకరాలలో పంట నష్టం
- అన్నదాతలను వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు
- ఎకరాన రూ.10వేల నష్ట పరిహారాన్ని ప్రకటించిన ప్రభుత్వం
- పంటల బీమా లేకపోవడంతో నష్టపోతున్న రైతులు
- యేటా సవాల్‌గా మారిన పంటల సాగు
- జిల్లావ్యాప్తంగా ఈయేడు జూన్ 1 నుంచి సెప్టెంబరు 2 వరకు 962.0 మి.మీ.ల అధిక వర్షపాతం నమోదు

ఆదిలాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి పంటలను సాగుచేసినా.. ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతల కష్టమంతా నీళ్లపాలవుతోంది. గత వారం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. నిన్నమొన్నటి వరకు ఆశాజనకంగానే కనిపించిన పంటలు.. గంటల వ్యవధిలోనే వరదనీటి పాలు కావడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. అధిక వర్షాలతో పంటల ఎదుగుదలపై ప్రభావం పడి చీడపీడలు చుట్టుముడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈయేడు జూన్ 1 నుంచి సెప్టెంబరు 2 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 847.5 మి.మీలు కాగా.. 962.0 మి.మీ.ల అధిక వర్షపాతం కురిసింది. జిల్లాలో అత్యధికంగా ఆదిలాబాద్ అర్బన్‌లో 1265.1 మి.మీ.ల వర్షపాతం కురిసింది. ఆ తర్వాత ఆదిలాబాద్ రూరల్‌లో 1185.4, ఉట్నూర్‌లో 1137.9, ఇంద్రవెల్లిలో 1235.7, గుడిహత్నూర్‌లో 1109.9, తాంసిలో 1046.2 మి.మీ.ల అధిక వర్షాపాతం కురిసింది. మిగితా మండలాల్లో వెయ్యి మి.మీల లోపే వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా నేరడిగొండ మండలంలో 733.5 మి.మీ.ల వర్షం కురిసింది. దీంతో భారీ వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా 1940 ఎకరాలలో పత్తి, సోయా, కంది, మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ యేడు జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5లక్షల 72వేల ఎకరాలు కాగా.. ఇందులో అధికంగా 4లక్షల ఎకరాలకు పైగా పత్తి పంటనే సాగవుతోంది. ఆ తర్వాత సోయా, కంది, ఇతర పంటలు సాగవుతున్నట్లు అధికారుల అంచనా ప్రకారం తెలుస్తుంది. ఈ యేడు జూన్, జూలై మాసాలలో సాధారణ స్థాయిలోనే వర్షపా తం నమోదయ్యింది. కానీ ఆగస్టు చివరి మాసం నుంచి సెప్టెంబరు మొదటి వారంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నది పరివాహక ప్రాంతంలోని పంటలను వరదనీరు ముంచెత్తడంతో తీవ్రనష్టం వాటిల్లుతుంది. ప్రతియేటా వర్షాలు, వరదల కారణంగా జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్న నామమాత్రంగానే నష్ట పరిహారాన్ని అందిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతీసారి వానాకాల సీజన్‌లో పంటలను సాగు చేయడం అన్నదాతలకు పెద్ద సవాల్‌గానే మారింది.

6మండలాల్లో అధిక వర్షపాతం

జిల్లాలో మూడు కాలాలు అధికంగానే ప్రభావం చూపుతాయి. వానాకాలం సీజన్‌లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. 18 మండలాలకు గాను ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్ రూరల్, ఆదిలాబాద్ అర్బన్, తాంసి, ఉట్నూర్ 6మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మిగితా 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, జైనథ్, మావల, నేరడిగొండ, నార్నూర్ మండలాల్లో స్వల్పంగా లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ప్రతియేటా జిల్లాలో అధిక వర్షపాతంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో భూ ఉపరితలం భారీ ఎత్తుపల్లాలుగా ఉండడంతో వర్షపు నీరు వేగంగా దిగువకు వెళ్లే క్రమంలో పంటలు భారీ కోతలకు గురవుతున్నాయి. అలాగే వర్షపు నీటిని ఒడిసి పట్టే ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఎక్కువగా లేక పోవడంతో చిన్నపాటి వర్షాలకే వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలు వరద నీటిలో మునిగి పోతున్నాయి. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది ఉప్పొంగి ప్రవహించడంతో పరివాహక ప్రాంతంలోని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా భీంపూర్, తాంసి, జైనథ్, బేల మండలాల్లోని పంటలు ఇంకా పెన్‌గంగా వరదనీటిలోనే కనిపిస్తున్నాయి. అలాగే ఉట్నూర్, తలమడుగు, తాంసి, సిరికొండ మండలాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పరిసర ప్రాంతాల్లోని పంటలు నేలమట్టమయ్యాయి. రోజుల తరబడి వరదనీరు పంట చేనులో నిలిచి ఉండడంతో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రైతులు ఎన్ని రకాల ప్రయత్నాలు చేసిన ప్రయోజనమే లేకుండా పోతుంది. ప్రకృతి వైపరీత్యాలు వెంబడించడంతో ప్రతియేటా రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుంది.

రూ.40వేల పరిహారానికి డిమాండ్

భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారాన్ని ఇచ్చేదుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరాన రూ.10వేల నష్టపరిహారాన్ని ప్రకటించింది. కానీ రైతులు ఏమూలాన సరిపోదంటూ అభిప్రాయ పడుతున్నారు. కనీసం ఎకరాన రూ.40వేల వరకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా పత్తి, సోయా, కంది పంటలే దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఎకరాన రూ.25వేల వరకు ఖర్చు చేసి పంటలను సాగు చేయడం జరిగిందని రైతులు చెబుతున్నారు. చేతికి వచ్చిన పంటలు నీటిపాలు కావడంతో నష్టాలు తప్పవంటూ అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే నష్టపరిహారం విషయంలో ఇంకా విధివిధానాలు ఖరారు కాలేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. వాస్తవానికి 33 శాతానికి పైబడి పంటలు దెబ్బతింటేనే ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం అందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. చాలీచాలని నష్టపరిహారంతో ఏమాత్రం ప్రయోజనం ఉండదంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం విత్తనాలకు కూడా సరిపోయే విధంగా లేదంటున్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి షరతులు లేకుండా నష్ట పరిహారాన్ని చెల్లించాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ముందుచూపు కరువు

ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో ప్రతీసారి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత రెండు, మూడేళ్లుగా భారీ వర్షాలు, వరదల కారణంగా వేల ఎకరాలలో పంటనష్టం జరుగుతున్నా.. నయా పైసా రైతులకు అందలేదు. గత ప్రభుత్వ హయాంలో లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. అయినా ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాన రూ.10వేల నష్టపరిహారాన్ని సరిపోదంటూ రైతులు వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే ఫసల్ బీమా యోజన కింద నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉండేది. కానీ గత ఐదారేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందుచూపుతో పంటల బీమా అవకాశాన్ని కల్పించి ఉంటే రైతుల కు ఎంతో మేలు జరిగేది. కనీసం పెట్టిన పెట్టుబడులైనా చేతికి వచ్చే అవకాశం ఉండేది. ప్రస్తుతం నష్టపోయిన పంటలను పూర్తిగా తొలగించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలన్న పెట్టుబడి ఖర్చులు ఎక్కువగానే ఉంటాయని రైతులు వాపోతున్నారు. పూత, కాత దశలో ఉన్న పంటలను వరదలు ముంచెత్తడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

చేతికి వచ్చిన పంటలు గంగపాలు



: ఏనుగు రాజారెడ్డి, రైతు, కరంజి జైనథ్ మండలం

అప్పుసప్పు చేసి పంటలను సాగు చేస్తే.. వర్షాలు, వరదల కారణంగా చేతికొచ్చిన పంటలన్నీ గంగపాలయ్యాయి. పెన్‌గంగా నదికి భారీ వరదలు రావడం బ్యాక్ వాటర్‌లో పంటలు మునిగి పాడైపోయాయి. పూతకాత దశలో ఉన్న పత్తి, సోయా పంటలు నేలపాలయ్యాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు చేతికి రాకుండానే పోయాయి. ఇతర పంటలను సాగు చేద్దామన్న చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల నష్టపరిహారం ఏమూలాన సరిపోతుంది. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

సంక్షిప్త సమాచారం



అదికారులతో సమీక్షిస్తున్న ఎస్‌ఈ

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఈ

ఆదిలాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం కరెంట్‌ను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా దూరంగా ఉండాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనాధికారికంగా ఫ్యూజ్‌ను మార్చడం, రిపేర్‌లాంటి మరమ్మతులు చేయడం, తీగలను సరి చేయడం ప్రమాదకరమన్నారు. విద్యుత్ వినియోగదారులు ఇళ్లలో స్విచ్‌బోర్డు, బోరు మోటార్ స్టాటర్ దగ్గర భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెం. 18004250028 ద్వారా సంప్రదించవచ్చునన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జడ్పీ సీఈవో

భీంపూర్, సెప్టెంబరు 4: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. ఆయన అధికారులతో కలిసి బుధవారం మండలంలోని నిపానిలో శానిటేషన్ భాగంగా పరిసరాలను పరిశీలించారు. ఆయనతో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఎంపీవో అతుల్ కుమార్, ఏపీవో సంగీత, ఈసీ నరేందర్, టీఏ అనసూయ, తదితరులు ఉన్నారు.

8న జిల్లా స్థాయి చదరంగం ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: ఈనెల 8న జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ అండర్-11 బాలబాలికల జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరి నన్నపుస్వామి, కన్వీనర్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్‌లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 1-1-2013 తర్వాత జన్మించిన బాలబాలికలు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్‌కు చెందిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల బాల బాలికలు ఈనెల 7న సాయంత్రం 5గంటలలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. బాలబాలికల వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటుగా తమ సొంత చెస్‌బోర్డు వెంట తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 9848736476 నెంబర్‌కు సంప్రదించాలని వారు సూచించారు.

మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను కలెక్టర్ రాజర్షిషా తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతిలను అందించి పర్యావరణంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు టీజీపీసీబీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అవగాహణ కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ఆటో ట్రాలీల ద్వారా పర్యావరణ సందేశాలతో టీజీపీసీబీ ద్వారా చేపట్టడం జరుగుతుందని సూచించారు. మట్టి గణపతి ద్వారా పర్యావరణ పరిరక్షణపై పాఠశాలలో, కళాశాలల్లో క్విజ్ కార్యక్రమాలు నిర్వహంచడం, చేతివృత్తుల వారికి మట్టి విగ్రహాలు తయారీపై శిక్షణ, ఆటోల వెనుక, పోస్టర్ల ప్రదర్శన, బస్టాప్‌లలో హోర్డింగ్‌లు మట్టి గణేష్‌ల ద్వారా పర్యావరణ పరిరక్షణపై కళాజాత ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ప్రోగ్రాం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ లక్ష్మణ్‌ప్రసాద్, ఏనలాయిస్ట్ రంజిత్‌కుమార్ సాయి ప్రసాద్, శివకృష్ణ, తదితరులు ఉన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

- డీఎస్పీ సీహెచ్.నాగేందర్

ఇచ్చోడ, సెప్టెంబరు 4: గణపతి మండపాల నిర్వహకులు వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ సీహెచ్ నాగేందర్ తెలిపారు. మండపాల నిర్వహకులతో బుధవారం మండల కేంద్రంలోని అభినందర్ కన్వేన్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వహణ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఉత్సవాలు శాంతియుతంగా జరిపించుకోవడంతో పాటు అందరితో కలిసికట్టుగా ఉండి సభ్యులందరూ నిర్వాహకుల మాటను విని నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్, ఎంపీడీవో లక్ష్మణ్, గుడిహత్నూర్ ఎస్సై ఇమ్రాన్, గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, నాయకులు శీరిష్‌రెడ్డి, అన్నెల లక్ష్మణ్, జాహెద్, మండపాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో గణేష్ మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

- శాంతియుతంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలి

సిరికొండ: గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై నవీన్ గౌడ్ అన్నారు. బుధవారం సిరికొండ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వినాయకచవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మండపాల నిర్వహకులదేనని ఆయన సూచించారు. నిమజ్జనం జరిగే వరకు ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకారం అందించాలని ఎస్సై నవీన్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆదివాసీల ధర్నా

బోథ్, సెప్టెంబరు 4: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన వజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐదు గూడేలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారిని ఆరోపిస్తూ బుధవారం బోథ్‌లో శాఖ కార్యాలయం ఎదుట ఆదివాసీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం త్రీఫేస్ విద్యుత్తును తమ గ్రామాలకు ఏర్పాటు చేస్తామంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఇందులో ఐటీడీఏ డైరెక్టర్ భూమన్నతో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



బోథ్‌లోని అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

ఏజెన్సీలో ఆదివాసీలకు కరువైన రక్షణ : ఎంపీ

ఆదిలాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందని ఎంపీ గోడంనగేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైనూర్ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమాయక ఆదివాసీ మహిళలను ఆత్యాచారాలు, హత్యలు చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదని, నేరాలకు పాల్పడిన నిందితులకే వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. గతంలో ఆదివాసీలపై జరిగిన దాడుల్లోనూ ప్రభుత్వం సరిగా వ్యవహరించక పోవడమే ఈ పరిస్థితికి కారణమని, ఆదివాసీలకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఏజెన్సీలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. ఏజెన్సీలో మహిళలపై దాడులను అరికట్టకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

- జైనూర్ సంఘటనపై విచారణకు డిమాండ్

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలంలో ఓ ఆదివాసీ గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేయడంతో పాటు తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై ప్రభుత్వం విచారణ జరపాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం జంగ్‌దేవ్‌పటేల్ డిమాండ్ చేశారు. సంఘటనకు బాధ్యులైన ఆటో డ్రైవర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో మండల అధ్యక్షుడు పెందూర్ త్రిమూర్తి, ఉపాధ్యక్షుడు పెందూరు తుకారాం, మండల ఉపాధ్యక్షుడు సిడాం బాపురావులు ఉన్నారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌టీయూ సంఘ ప్రతినిధులు

ఐటీడీఏ, గిరిజన సంక్షేమ టీచర్లకు ఉత్తమ అవార్డులు ప్రకటించాలి : ఎస్టీయూ

ఉట్నూర్, సెప్టెంబరు 4: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు అందిస్తున్న విధంగా.. ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు కూడా అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలేష్ చౌహాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్‌శీతల్ రవినాయక్‌లు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలో పీవో ఖుష్బు గుప్తను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, జిల్లా పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించారని, అదేవిధంగా ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సైతం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాదవ్‌రవినాయక్, తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియాపై నిఘా : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: జైనూర్‌లో జరిగిన ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని, పోలీసు యంత్రాంగం ఈ విషయమై కేసులను నమోదు చేసిందని, అంతేకాకుండా దీనికి సంబంధించి దర్యాప్తు సైతం కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, వదంతులను ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేసిందని, నిజానిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకోవడం, కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యంగా జైనూర్‌లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఇతర ప్రాంతాల వారికి జైనూర్‌లో అనుమతి లేదని, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తప్పు చేసిన వారికి శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.